క్లుప్తంగా

ఎమ్మెల్యే చొరవతో రూ.16 లక్షల ఆసరా సొమ్ము జమ



కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు(డీఎన్నార్) అన్నారు. ముదినేపల్లి మండలానికి చెందిన నాలుగు డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా సొమ్ము రూ.16 లక్షలు జమ కావడంతో మహిళలు ఆదివారం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ముదినేపల్లి మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం పర్యటన సందర్భంగా నాలుగు గ్రూపులకు వైఎస్సార్ ఆసరా నిధి రాలేదని డ్వాక్రా సంఘాలు మహిళలు ఎమ్మెల్యేకు చెప్పారు. దీంతో ఆయన సెర్ప్ సీఈవో దృష్టికి తీసుకువెళ్లగా పెండింగ్ గ్రూపులకు నగదు జమ చేశారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాలు నాయకులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ విస్తరణ పనులు వేగవంతం



మండవల్లి: నేషనల్ హైవే విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎన్‌హెచ్ విస్తరణ పనులు పూర్తి కావడానికి సుమారు రెండేళ్లు పడుతుందని సూపర్‌వైజర్ ఏసుబాబు పేర్కొన్నారు. విజయవాడ-భీమవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిధిలో కానుకొల్లు సమీపంలో నేషనల్ హైవే విస్తరణ పనులు అధికారులు నిర్వహిస్తున్నారు. ఈ పనులు పూర్తిగా జరిగితే పలు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టినట్లవుతుందని భావిస్తున్నారు.

యోగా పోటీలకు ఎంపిక



పామర్రు: జిల్లా స్థాయిలో త్వరలో జరగబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ యోగా పోటీలకు తమ హైస్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు అసీసీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీ చాకో తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో విజేత అయిన విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన నియోజకవర్గ స్థాయిలో జరిగిన యోగా పోటీల్లో అండర్-17 విభాగంలో తమ స్కూల్ విద్యార్థి ఆదర్శ్ విజేతగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విజేత విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన పీఈటీ మట్టా గ్లాడిసన్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీపీఎం నేత కొరటాలకు నివాళి

గుడివాడ టౌన్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ జయంతిని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక, రైతు సంఘం, చేనేత కార్మికుల విభాగాల ప్రతినిధిగా కొరటాల పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక సేవలు చేశారని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎస్ మురళీకృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ సీపీ రెడ్డి, టి.లక్ష్మణరావు, ఆర్.కొండ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, ఐద్వా నాయకులు పి.వీరమ్మ, పి.రజిని, ఎలీషారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు గడువు పొడిగింపు

పెడన: ఈ క్రాప్ నమోదు గడువును ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగించిందని, ఇంకా ఎవరైనా ఉంటే వెంటనే నమోదు చేయించుకోవాలని పెడన ఏఓ జీవీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 19,592 ఎకరాలకుగాను ఇప్పటివరకు 15,295 ఎకరాలు ఈ క్రాప్‌లో నమోదయ్యాయని చెప్పారు. మిగిలిన రైతులు కూడా తక్షణం తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వేసిన పంట రకం, ఆధార్ నంబర్, పట్టదారు పాస్ పుస్తకం నంబర్, ఫోన్ నంబర్ చెప్పి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ క్రాప్‌లో పేరు నమోదు చేసుకుంటేనే వేసిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి అందే రైతు వారి సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, రైతు భరోసా వంటి వాటికి కూడా వర్తిస్తోందని వివరించారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం

చల్లపల్లి: గ్రామ ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) ఆలయానికి విరాళం అందించారు. ఆదివారం స్థానిక గ్రామ దేవత సంపటాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మశాస్త్రఅయ్యప్ప స్వామి ఆలయానికి ముమ్మనేని నాని-మల్లీశ్వరి దంపతులు రూ.50 వేలు విరాళం అందజేశారు. దాతలను కమిటీ పెద్దలు సన్మానించారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు (డీఎన్నార్) చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కేటాయించిన రూ.20 లక్షల నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నడూ ఇటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. సమన్వయంతో పనిచేసి మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ ఐయినాల బ్రహ్మాజీరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు గద్దె ఆనంద్‌కుమార్, సర్పంచులు మోకా లక్ష్మి, మహాదేవ్ విజయబాబు, మూలలంక ఎంపీటీసీలు రావాడి బాలు, ఇమ్మానేని లక్ష్మణరావు, తిరుమలశెట్టి సుబ్రహ్మణ్యం, ముద్దం గాంధీ, పీఏసీఎస్ అధ్యక్షుడు తిరుమాని గణపతి, నాయకులు మోకా రామకృష్ణ, కడలి నాగరాజు, కొల్లాటి సత్యనారాయణ, సాగిరాజు వాసురాజు, కొల్లాటి నాగరాజు, బొమ్మిడి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

కైకలూరు: స్థానిక తాలూకా సెంటర్‌లో అద్భుతమైన అంబేడ్కర్ భవనాన్ని నిర్మిస్తామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. దళితనాయకులతో కలసి నిర్మాణ స్థలం వద్ద సరిహద్దులను సిబ్బందితో ఆదివారం గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. నిర్మాణానికి ఖర్చు మొత్తం తానే సమకూరుస్తానని చెప్పారు. ముందుగా నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయాలని నాయకులకు సూచించారు. సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, మండల కో ఆప్షన్ సభ్యుడు సోమల శ్యాంసుందర్, నాయకులు తంభాల వినోదరావు, ఆటపాక మాజీ సర్పంచ్ ఈదా భైరాగి, బల్లవరపు సాయి, నిమ్మల సాయి, డాక్టర్ జాన్ విక్టర్, కూనవరపు సతీష్, పాట్రిక్ పాల్, ఎస్.కిరణ్ కుమార్, వి.అజయ్ తదితరులు పాల్గొన్నారు.



పెదలంకలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

భోగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కృషి

కైకలూరు(కలిదిండి): అతి పురాతన కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఆలయం వద్ద నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమీప గ్రామాలకు చెందిన పలువురు భక్తులను నిర్మాణ, అభివృద్ధి కమిటీలలో సభ్యులుగా నియమించామన్నారు. దాతల విరాళాలతో పూర్తి నిర్మాణం చేయనున్నామన్నారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయం, ముఖమండపం, అనివేటి మండపం, ప్రకార మండపం, ఉపాలయాలు, ధ్వజస్తంభం పునర్నిర్మాణం నిమిత్తం రూ.8 కోట్లు అంచనా రూపొందించామన్నారు. ఇప్పటికే మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందించాలని కోరారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, కైకలూరు మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, మాజీ ఏఎంసీ అధ్యక్షుడు నీలపాల వెంకటేశ్వరరావు, సర్పంచులు మసిముక్కు మారుతి ప్రసన్న, సాన మీనా సరస్వతి, ద్రోణాద్రి నాగలక్ష్మి, అనపర్తి వడ్డీకాసులు, మహాదేవ విజయబాబు, గండికోట ఏసుబాబు, ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ, ఇమ్మానేని లక్ష్మణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో దేవాలయ నిర్మాణ నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

అందరి సహకారంతో అభివృద్ధికి కృషి



పమిడిముక్కలలో ఎంపీటీసీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ వేద సుప్రజ



మొవ్వలో ఎంపీపీ దంపతులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ, అధికారులు

ఎంపీపీల పాలక వర్గానికి రెండేళ్లు

పమిడిముక్కల: ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సహకారంతో మండలాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నట్లు ఎంపీపీ కాసాని వేద సుప్రజ తెలిపారు. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఎంపీటీసీలుగా ప్రమాణస్వీకారం చేసి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ కేక్ కట్ చేశారు. ఎంపీటీసీలకు ఎంపీడీఓ విఠల్ పాల్, ఎంపీపీ సుప్రజ మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుప్రజ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. ఏఓ రాజు, ఈవోపీఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీలు మీర్జా సజ్జాద్ అలీ, మరీదు రాజ్యలక్ష్మి, గుర్విందపల్లి వంశీ, వీర్ల ఆదిశేషు, జుజ్జువరపు శృతి, మేరుగ రాజేశ్వరి, ఊబ మల్లేశ్వరి, కంచర్ల అంకకుమారి తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ: మండల అభివృద్ధికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అండదండలతో, మండల అధికారుల సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎంపీపీ కొండేటి ఇందిర పేర్కొన్నారు. మండల పరిషత్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో అభినందన సమావేశం నిర్వహించారు. ముందుగా అభివృద్ధికి సహకరిస్తున్న అధికారులకు, పలు గ్రామాల ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయప్రసాద్, ఎంపీడీవో జి. సుధా ప్రవీణ్, పలు గ్రామాల ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొని ఎంపీపీ, చందు దంపతులను సత్కరించారు.

వెయిట్ లిఫ్టర్లకు సన్మానం

గుడివాడ టౌన్: క్రీడాకారుల ఖ్యాతి చరిత్రగా మిగిలిపోతుందని ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ సభ్యులు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఇన్‌డోర్ స్టేడియంలో ఆదివారం జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన ఇరువురు వెయిట్‌లిఫ్టర్లను ఘనంగా సత్కరించారు. క్రీడలలో ఉత్తమ ఫలితాలు సాధించిన నేపథ్యంలో రైల్వే ఉద్యోగాలు సంపాదించి ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగులుగా జీవనం సాగిస్తున్న ఇరువురు విశ్రాంత క్రీడాకారులను సన్మానించడం క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని వారు అన్నారు. వీరిలో కంది అప్పారావు విశ్రాంత రైల్వే ఉద్యోగి. రైల్వే క్రీడల్లో ఆల్ ఇండియా గోల్డ్ మెడల్‌తో పాటు జాతీయ పోటీలలో బంగారు పతకం సాధించారు. ఇక రాష్ట్ర స్థాయి పోటీల్లో 15 బంగారు పతకాలు సాధించారు. మరో క్రీడాకారుడు కె.రాయప్ప సదరన్ రైల్వేలో ఉద్యోగం చేస్తూ ఇటీవల పదవీ విరమణ చేశారు. వీరు నేషనల్ పోటీలలో బంగారు పతకం, రైల్వే ఆల్ ఇండియా పోటీలలో బంగారు పతకం, 10కి పైగా రాష్ట్ర స్థాయి బంగారు పతకాలు సాధించారు. ఇంతటి ఘన చరిత్ర గలిగిన క్రీడాకారులను యువ క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని స్టేడియం కమిటీ సభ్యులు కోరారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, కృష్ణాజిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరి కె.దామోదరరావు, కోచ్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వెయిట్ లిఫ్టర్లను సత్కరిస్తున్న స్టేడియం కమిటీ సభ్యులు

వినాయకా.. సెలవిక



యాకమూరులో గణేష్ విగ్రహ ఊరేగింపును ప్రారంభిస్తున్న భక్తులు

ఘనంగా నిమజ్జనోత్సవాలు

పమిడిముక్కల: మండలంలో గణపతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గుర్రాల్లంక గణేష్ ఉత్సవ కమిటీ, బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏడు రోజులుగా వైభవంగా పూజలు నిర్వహించారు. స్వామి వారిని ఆదివారం భారీ ఊరేగింపు, తీన్‌మార్ డప్పులు, డీజే సౌండ్స్‌తో గ్రామంలో ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకొంటూ, డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. స్థానికంగా ఉన్న బందర్ కాలువలో నిమజ్జనం చేశారు. తొలుత బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు, చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశాఖపట్నంకు చెందిన పవన్‌కుమార్ తీన్‌మార్ డప్పుల బృందంలో మహిళల డప్పుల వాయిద్యాలు ఆకట్టుకొన్నాయి. స్వామి వారి వద్ద పూజలో ఉంచిన లడ్డూ ప్రసాదాన్ని వేలంలో ఉయ్యూరు తనూజ రూ.11,116 ధర పెట్టి దక్కించుకొన్నారు. జువ్వలపాలెంలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. వీరంకిలాకు విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భారీ అన్నసంతర్పణ చేశారు. మామిళ్లపల్లిలో జరిగిన విశేష పూజలో సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రమణ్యం దంపతులు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: గణేష్ నిమజ్జన వేడుకలు మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం ఘనంగా జరిగాయి. వల్లూరుపాలెం, యాకమూరు, గరికపర్రు గ్రామాల్లో ఏడు రోజులుపాటు భక్తులచే పూజలందుకున్న వినాయకుని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఏర్పాటు చేసి డీజే సంగీతం, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల పరిధిలోని కాలువలలో గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎస్ఐ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పామర్రు: గణపతి నవరాత్రులలో భాగంగా వినాయక స్వాములను నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రజక బజారులో స్వామిని గ్రామంలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక పుల్లేరు కాలువలో స్వామిని నిమజ్జనం చేశారు. ఆర్‌హెచ్ నగర్ నాగులేరు గట్టు వద్ద వినాయక స్వామికి గ్రామంలో ఊరేగింపు చేశారు. డప్పువాయిద్యాలతో, డీజే సౌండ్‌లతో బాణసంచా కాల్చుతూ ఊరేగించారు. అనంతరం స్థానిక కాలువలో నిమజ్జనం చేశారు. వల్మీకేశ్వరీ ఆలయం వద్ద గణనాథుని గ్రామోత్సవం చేసి అనంతరం స్థానిక కాలువలో స్వామిని నిమజ్జనం చేశారు.

గుడివాడ టౌన్: వినాయక చవితి సందర్భంగా ఆదివారం నిమజ్జనాల కార్యక్రమం ఉల్లాసంగా భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు గులాములు చల్లుకుంటూ, తీన్మార్ డప్పువాయిద్యాల నడుమ చిందులు వేస్తూ స్వామివారిని వాహనాలపై ఎక్కించి పట్టణ వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్థానిక పామర్రు రోడ్‌లోని పెద్ద కాల్వలో స్వామి వారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



గుర్రాల్లంకలో వినాయకుడి ఊరేగింపు



జువ్వలపాలెంలో స్వామి వారి గ్రామోత్సవం



పామర్రులో ఘనంగా ఊరేగుతున్న ఆర్‌హెచ్ నగర్ గణనాథుడు



పామర్రు రజక బజారుకు చెందిన వినాయకుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



గుడివాడ ఏలూరు రోడ్‌లో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



గుడివాడ నెహ్రూచౌక్ సెంటర్‌లో సందడి చేస్తున్న యువకులు

కనీస వేతనాలు ఇవ్వాలని వినతి



మచిలీపట్నం టౌన్: నగర పాలక సంస్థ పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు ఇవ్వాలని ఆయాలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయాలు మాట్లాడుతూ నగర పాలక సంస్థ పాఠశాలల్లో 44 మందిమి 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో ఆయాలుగా పని చేస్తున్నామని, జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో తమకు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వరలక్ష్మి, నాగలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మయూర ధ్వజుడు హరికథా గానం



నాగాయలంక: స్థానిక వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అంబా సాయి కిరణ్‌శర్మ (కౌశిక్)బ్రహ్మత్వంలో పొన్నూరు రవితేజ, జ్యోతి దంపతులచే ప్రసన్న గణపతి ఆలయంలో, ఉత్సవ విగ్రహ వేదికపై పూజలు జరిగాయి. నిత్య కార్యక్రమాల్లో భాగంగా సబ్బినేని వెంకటేశ్వరరావు (అబ్బాయి) ఆర్థిక సౌజన్యంతో కర్నూలుకు చెందిన టి.సాయిరామ్ భాగవతార్‌చే మయూర ధ్వజుడు హరికథా గానం జరిగింది. పాపర్తి ఆంజనేయులు (అవనిగడ్డ) వయోలిన్, ఎం.నగధర రావు(తెనాలి) మృదంగంతో సహకరించారు. ఈ కార్యక్రమం భక్తులను అలరించింది.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగాయలంక ప్రసన్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం 108 మంది భక్తులచే సంపూర్ణ భగవద్గీత పారాయణం జరుగుతుందని కమిటీ అధ్యక్షుడు మండవ బాలవర్ధిరావు, ప్రతినిధి చిట్టా సాంబశివరావు ఆదివారం తెలిపారు.

వైభవంగా కొనసాగుతున్న గణపతి ఉత్సవాలు



పామర్రు బాపూజీపేటలో వినాయక స్వామిని పూజిస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



తోటలోని వినాయకుడి విగ్రహానికి గజమాల వేసి పూజిస్తున్న భక్తులు



పెరికెగూడెం వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు



గుడివాడలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వెలమపేట రామాలయం, స్టేషన్‌రోడ్ కోదండ రామాలయాల్లోనూ మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం, లోకుమూడి తదితర గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండవల్లిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద, పెరికెగూడెం వినాయకుని ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ పేర్కొంది.

పామర్రు: వినాయక చవితి నవరాత్రులలో భాగంగా ఆదివారం పలు చోట్ల విశేష పూజలను ఘనంగా నిర్వహించారు. స్థానిక తోటలోని వినాయక చలువ పందిరిలో స్వామికి గజ మాల వేసి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు భగవత్‌గీతా పారాయణ చేశారు. కార్యక్రమంలో అల్లంశెట్టి సురేష్, చొప్పకట్ల రమేష్, పి.కేశవబాబు, శ్రీపతి కృష్ణ, గుమ్మడి నాగేశ్వరరావు, శ్రీపతి వెంకటేశ్వరరావు, దాసరి కొండ, అల్లంశెట్టి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్ బజారులో ఏర్పాటు చేసిన వినాయక స్వామి పందిలో అన్న సమారాధన చేశారు. స్థానిక రావి హరిగోపాల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో స్వామికి విశేష పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించి అనంతరం నిమజ్జనం చేశారు. స్థానిక బాపూజీపేటలోని వినాయక పందిరిలో స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, వార్డుమెంబర్ ఆరేపల్లి శ్రీహరి, నాయకులు ఆరేపల్లి రాకేష్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధి జమీదగ్గుమిల్లిలో ఏర్పాటుచేసిన వినాయక చలువ పందిలో స్వామిని అరటి మొక్కలతో, మామిడి మండలతో పలు రకాల కాగిత పువ్వులతో సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శీతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాలు ఆదివారం కూడా కొనసాగాయి. స్థానిక 18వ వార్డుకు చెందిన పెదమల్లు లక్ష్మీనారాయణ గుప్త-మాధవి దంపతులు పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు కె.ఆంజనేయ ప్రకసాద్, చుండూరి శేఖర్, కృష్ణ, హారిక, మూడెడ్ల ఉమ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారిని నవనీత గణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు.

గాయపడిన ఆవుకు చికిత్స

గుడివాడ టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని రోడ్డుపై తిరుగుతున్న ఆవును గాయపర్చిన నేపథ్యంలో మాచర్ల రామకృష్ణ (ఆర్‌కే) యూత్ సభ్యులు చికిత్స చేయించి ఆదరించారు. సమాచారం తెలుసుకున్న ఆర్‌కే యూత్ సభ్యులు పశువైద్య శాఖాధికారి డాక్టర్ దివాకర్, డాక్టర్ చింతయ్య సహకారంతో ఆవుకు కట్టుకట్టి చికిత్స చేయించారు. ఆవు చికిత్సకు సహకరించేలా ఆర్‌కే యూత్ సభ్యులు తోడ్పాటునిచ్చారు. మూగ జీవాలను ఆదరించిన ఆర్‌కే యూత్ సభ్యులను, స్పందించి వెంటనే చికిత్స చేసిన వైద్యాధికారులను స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ మూగజీవాలను రోడ్డుపై వదిలే యజమానులకు మున్సిపల్, పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన ఆవుకు చికిత్స చేస్తున్న వైద్యబృందం, ఆర్‌కేయూత్ సభ్యులు